# నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు!



చిత్తూరులో సిద్ధమైన ఓ పరీక్ష కేంద్రం

## వీఆర్వో, వీఆర్ఏ పోస్టుల భర్తీకి నేడు రాతపరీక్ష

## రెండు బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులే అనుమతి

## 61,335 మంది అభ్యర్థులకు 125 పరీక్ష కేంద్రాలు

చిత్తూరుకలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆన్‌లైన్): గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో), గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) పోస్టుల భర్తీలో భాగంగా ఆదివారం జిల్లాలో నిర్వహించనున్న రాత పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 79 వీఆర్వో పోస్టులకోసం 55,020 మంది, 283 వీఆర్ఏ పోస్టులకు 6,315 మంది అభ్యర్థులు పోటీపడనున్నారు. ఇందుకోసం చిత్తూరు-34, పుత్తూరు-14, తిరుపతి-25, శ్రీకాళహస్తి-5, మదనపల్లె-23, పుంగనూరు-4, పలమనేరు-10, కుప్పంలో-7, పీలేరులో-3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు సజావుగా సాగేలా ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, అసోసియేటెడ్ చీఫ్ సూపరింటెండెంట్, పరిశీలకులను నియమించారు. ఇన్విజిలేటర్లుగా 2,294 మంది విధుల్లో ఉంటారు. 125 కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 144 సెక్షన్ విధించనున్నారు. ఇందులోభాగంగా శనివారం మధ్యాహ్నం నుంచే అన్ని పరీక్ష కేంద్రాలను రెవెన్యూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తిలో 76వ సెంటర్ హాల్‌టికెట్ తప్పుగా ప్రచురణ కావడంతో అక్కడ పరీక్ష రాసే 125 మంది అభ్యర్థులకు నేరుగా, వ్యక్తిగతంగా, ఎస్ఎంఎస్ ద్వారా, రిజిస్టర్ పోస్టు ద్వారా వివరాలు తెలిపారు. ప్రశ్నపత్రాలను ఉదయం 6 గంటలకు పోలీసు బందోబస్తు మధ్య సెంటర్ల వారీగా తరలించనున్నారు. 85 మంది అంధ అభ్యర్థులకోసం టెన్త్ చదివిన యువకులను సహాయకులుగా నియమిస్తున్నారు. ప్రత్యేక పరిశీలకులుగా డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను కలెక్టర్ నియమించారు. వీఆర్ఏ రాత పరీక్ష మాత్రం చిత్తూరులోని 15 కేంద్రాల్లో మాత్రమే జరగనుంది.

### 11 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు

జిల్లావ్యాప్తంగా 11 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆయా కేంద్రాలకు ప్రత్యేక పరిశీలకులను శనివారం ఆయన నియమించారు.

### అభ్యర్థులకు సూచనలు

ప్రతి అభ్యర్థి హాల్ టికెట్, రెండు బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులతో మాత్రమే పరీక్ష కేంద్రంలోకి వెళ్లాలి. వీఆర్వో పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, వీఆర్ఏ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. ఈ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. సమయం పూర్తయ్యేవరకు పరీక్ష హాలులోనే ఉండాలి. అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి అనుమతిస్తారు. ఓఎంఆర్ షీట్‌లో బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతోటే జవాబులు రాయాలి. పరీక్ష పూర్తయిన తర్వాత ప్రశ్నపత్రం ఇంటికి తీసుకెళ్లవచ్చు. హాల్ టికెట్‌పై ఫొటోలు లేని అభ్యర్థులు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను చీఫ్ సూపరింటెండెంట్‌కు అందజేయాలి. ఫొటోలు సమర్పించని వారిని పరీక్షలకు అనుమతించరు. ఎక్కడైనా ఎలాంటి తప్పుడు చర్యలకు పాల్పడినా క్రిమినల్ చర్యలు నమోదుతోపాటు, భవిష్యత్తులో ఎటువంటి ఉద్యోగానికైనా అనర్హుడిగా అధికారులు ప్రకటిస్తారు.

### విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు : కలెక్టర్

వీఆర్వో, వీఆర్ఏ పోస్టుల భర్తీకి ఆదివారం జరగనున్న రాత పరీక్షల విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సాల్మన్ ఆరోగ్యరాజ్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. 125 పరీక్ష కేంద్రాలకు ఇన్విజిలేటర్లుగా 2,294 మందిని నియమించగా, వీరిలో కొందరు ఉద్దేశపూర్వకంగా శనివారం మధ్యాహ్నం నుంచే విధులకు హాజరు కాలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలా గైర్హాజరైన వారందరిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న వేదిక్ వర్సిటీ వీసీ సుదర్శన్ శర్మ

'సీమ'లోని దేవాలయాలు..

# కళా, సంప్రదాయాలకు నెలవు

## జాతీయ సదస్సు ప్రారంభ సభలో వక్తల మనోభావం

ఎస్వీయూక్యాంపస్, ఫిబ్రవరి 18 (ఆన్‌లైన్): రాయలసీమలోని దేవాలయాలు వాస్తు, కళా, సంప్రదాయాలకు, నెలవని పలువురు అభిప్రాయపడ్డారు. దీన్ని వృద్ధి చేసిన వారిలో శ్రీకృష్ణదేవరాయలు, ఇతర రాజుల కృషి ఉందన్నారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం నేటితరంపై ఉందన్నారు. 'రాయలసీమ దేవాలయాల్లో వాస్తు శిల్పకళ' అంశంపై రెండురోజుల జాతీయసదస్సు శనివారం తిరుపతిలోని ఎస్వీయూ సెనేట్ హాలులో ప్రారంభమైంది. వర్సిటీ పురావస్తు విభాగం నిర్వహించిన ఈ సదస్సులో వేదిక్ వర్సిటీ వీసీ సన్నిదానం సుదర్శనశర్మ, ఎస్వీయూ రిజిస్ట్రార్ జె.ప్రతాపరెడ్డి, ఆంధ్రా వర్సిటీ ప్రొఫెసర్ మైనేని కృష్ణకుమారి ప్రసంగించారు. సర్వశాస్త్రాలకు మూలమైన పురావస్తు శాస్త్రం లేకుంటే మన ప్రాచీన నాగరికతను చాటిచెప్పే హరప్పా వెలుగులోకి వచ్చేది కాదన్నారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు మన దేశం పుట్టినిల్లన్నారు. ప్రాచీన భారతీయతను చాటడంలో శిలా శాసనాలు, నాణేలు, ఇతర కట్టడాలు, దేవాలయాల్లోని వాస్తు శిల్పకళ కీలక పాత్ర పోషిస్తున్నట్లు వారు వివరించారు. ఈ క్రమంలో రాయలసీమలోని ఆలయాలు, కోటలు ఎంతో ప్రసిద్ధి పొందాయన్నారు. మన సంస్కృతి పరిరక్షణకు కీలక పాత్ర పోషించేపురావస్తు శాస్త్రాన్ని వెలికి తేవడానికి విలియం జోన్స్, చార్లెస్ వంటి వారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. వర్శిటీలో ఆర్కియాలజీ విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అవిరళ కృషి చేస్తోందని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ వి.కోదండ రామిరెడ్డి అన్నారు. వాయల్పాడులోని ఎన్టీఆర్ డిగ్రీకళాశాల చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ కరణం సుధాకర్ రాసిన 'ఆంధ్రప్రదేశ్ ఆలయ కళల్లో మహిషాసుర మర్ధిని, ప్రొఫెసర్ పి.నీరజాక్షులునాయుడు రాసిన 'మైనర్ హిందూ డైటీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్' పుస్తకాలను సదస్సులో ఆవిష్కరించారు. ఈ సదస్సులో నిర్వహకుడు పి.నీరజాక్షులు నాయుడుతోపాటు ప్రొఫెసర్ కిరణ్‌క్రాంత్‌చౌదరి, సంస్కృత విద్యాపీఠం రిజిస్ట్రార్ ఎ.గురుమూర్తి, విభాగాధిపతి భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్లు నాగోలు కృష్ణారెడ్డి, శకుంతల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వివిధ అంశాలపై ప్రతినిధులు పత్రసమర్పణ చేశారు.

# 'నిండు జీవితానికి రెండు చుక్కలు'

## నేడు పల్స్‌పోలియో

చిత్తూరు క్రైం, ఫిబ్రవరి 18 (ఆన్‌లైన్): పోలియో వ్యాధిని నిర్మూలించడంలో భాగంగా 'నిండు జీవితానికి రెండు చుక్కలు' అన్న నినాదంతో జిల్లావ్యాప్తంగా అధికారులు ఇప్పటికే అవగాహన ర్యాలీలు, మొబైల్ ప్రచారం నిర్వహించారు. అలాగే ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 4,62,211మంది 0-5 ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 2,954 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పుణ్యక్షేత్రాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో కూడా ప్రత్యేక మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయనున్నారు. ఆదివారం మిగిలిపోయిన పిల్లలకు రెండురోజులపాటు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారు.

మంత్రి ఆదేశించినా..

# పట్టించుకోని కళాశాలల ప్రిన్సిపాళ్లు

## ఈనెల 25లోపు దరఖాస్తులు పంపించకుంటే ఉపకారం కట్

**ఆన్‌లైన్, చిత్తూరు రూరల్**

'పేద విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసే ఉపకార వేతనాలను సకాలంలో అందించడానికి కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రద్ధ తీసుకోవాలి. ఫీజులు కట్టలేదని విద్యార్థులను ఇబ్బంది పెడితే సహించం.' ఇదీ ఇటీవల చిత్తూరులో ఉపకార వేతనాలపై ఏర్పాటు చేసిన సమీక్షలో కళాశాలల ప్రిన్సిపాళ్లపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి రఘువీరారెడ్డి, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రేమండ్ పీటర్ ఆగ్రహం.

అయినా ప్రిన్సిపాళ్ల తీరులో మార్పు రావడం లేదు. సాంఘిక, గిరిజన, బీసీ, ఈబీసీ సంక్షేమ శాఖలకు సంబంధించి 2011-12 విద్యా సంవత్సరంలో 1,35,073 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు సరిపడా నిధులను విడుదల చేసినా క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో ఉపకార వేతనాలకు సంబంధించిన దరఖాస్తులు సంక్షేమ శాఖలకు అందలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతుండటంతో ఇటీవల చిత్తూరులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి రఘువీరారెడ్డి, సంక్షేమ శాఖ రాష్ట్ర నోడల్ ప్రిన్సిపల్ సెక్రటరీ రేమండ్ పీటర్ సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ నెల 10వ తేదీలోపు ఆయా కళాశాలల నుంచి దరఖాస్తులను పూర్తి స్థాయిలో పంపించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకనూ 40శాతం కళాశాలలు కూడా వారికి సంబంధించిన బుక్ లెట్లు, హార్డు, సాఫ్టు కాపీలను పంపించలేదు. సాంఘిక సంక్షేమ శాఖలో 35,005 మంది చదువుకుంటుంటే ఇప్పటివరకు 21,346 మంది దరఖాస్తులను పంపించారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖలో 4,616 మందికిగాను ఇప్పటి వరకు 2,738 మందివి, బీసీ సంక్షేమ శాఖలో 68,160 మందికిగాను 42,428 మందివి, ఈబీసీలో 26,774 మందికిగాను 16,637 మంది విద్యార్థుల దరఖాస్తులను మాత్రమే అందజేశారు. మొత్తం అన్ని శాఖలకు కలిపి 51,406 మంది విద్యార్థులకు సంబంధించి దరఖాస్తులు సంక్షేమ శాఖలకు అందలేదు.

### సమన్వయలోపమే కారణం

వెరిఫికేషన్ అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్ల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే దరఖాస్తులను పంపడంలో ఆలస్యం జరుగుతోందని సంక్షేమాధికారులు చెబుతున్నారు.

కుల, ఆదాయం, గత ఏడాది చదివిన మార్కుల జాబితాను అప్‌లోడ్ చేయడంలో ఆలస్యం ఏర్పడుతుందని కళాశాలల ప్రిన్సిపాళ్లు చెబుతున్నప్పటికీ వాస్తవానికి ఆ పనులను రోజుల వ్యవధిలోనే చేయవచ్చని సంక్షేమాధికారులు చెబుతున్నారు. ఏదేమైనా ఈ నెల 25వ తేదీలోపు అన్ని శాఖలకు సంబంధించిన దరఖాస్తులు సమగ్రంగా పంపించకుంటే ఉపకార వేతనాలను మంజూరు చేయమని సంక్షేమ శాఖల నోడల్ అధికారి జె.చంద్రమూర్తి స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన

## హైదరాబాద్ కమిషనర్ కృష్ణబాబు



మొగరాల జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠాలు చెబుతున్న కమిషనర్ కృష్ణబాబు

దామలచెరువు, ఫిబ్రవరి 18 (ఆన్‌లైన్):మౌలిక సదుపాయాలతో అర్హత గలిగిన ఉపాధ్యాయులుండే ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన లభిస్తుందని హైదరాబాద్ కార్పొరేషన్ కమిషనర్ టి.ఎం.కృష్ణబాబు అన్నారు. పాకాల మండలం మొగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాకతీయ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదవ తరగతి నుండి ఇంటర్ వరకు కష్టపడి చదివితే జీవితాంతం సుఖంగా వుండవచ్చన్న విషయాన్ని పిల్లలు గుర్తుంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారిలో ఆత్మస్థయిర్యం పెంచాలన్నారు.గ్రామీణ ప్రాంతాల పాఠశాలల్లో మెరుగైన విద్యకోసం కాకతీయ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.కాకతీయ ట్రస్ట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను కలెక్టర్ సాల్మన్ ఆరోగ్యరాజ్‌తో కలసి ఆయన ప్రారంభించారు.అనంతరం ప్రతిభావంతులైన ఎనిమిదిమంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు.పదవ తరగతి విద్యార్థులకు సోలార్ ల్యాంప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన టీచర్‌గా మారి కాసేపు విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధించారు. కలెక్టర్ ఆరోగ్యరాజ్ మాట్లాడుతూ ముప్పూరి శ్రీనివాసులు నాయుడు సేవలను స్ఫూర్తిగా తీసుకొని పాఠశాలల అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. కాకతీయ ట్రస్టు అధ్యక్షుడు ముప్పూరి శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో విద్య నభ్యసించే ఇంటర్ విద్యార్థులకు పాకాలలో ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇస్తామన్నారు.సివిల్ సర్వీసుకు ప్రిపేరయ్యే పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. డీఈవో దేవానంద రెడ్డి, డిప్యూటీ డీఈవో ప్రతాప్ రెడ్డి, ఎంఈవో అరుణాచల రెడ్డి, హెచ్ఎం చెంగల్రాయ నాయుడు, కాకతీయ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టీలు నామినేని రమేష్ బాబు, వీరరాఘవులు, ముప్పూరి కృష్ణమూర్తి నాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామచంద్ర య్యా, చిన్నస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.